# స్వచ్ఛాంధ్ర సాధనే ధ్యేయం

## ● కాలానుగుణ వ్యాధులపై అప్రమత్తత అవసరం ● మంత్రి మృణాళిని

విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే: స్వచ్ఛాంధ్ర సాధనే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని, ప్రజల ఆరోగ్య సంరక్షణ, సామాజిక వికాసం, వృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తుందని రాష్ట్ర గృహనిర్మాణశాఖ మంత్రి కిమిడి మృణాళిని పేర్కొన్నారు. విజయనగరం పట్టణంలో శనివారం నిర్వహించిన దోమలపై దండయాత్ర, పరిసరాల పరిశుభ్రత ర్యాలీని మంత్రి మృణాళిని గంటస్తంభం వద్ద జెండా ఊపి ప్రారంభించారు. ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు, ఎమ్మెల్యే మీసాల గీత, జడ్పీ అధ్యక్షురాలు శోభా స్వాతిరాణి, పురపాలక సంఘ ఛైర్మన్ ప్రసాదుల రామకృష్ణ, కలెక్టరు వివేక్ యాదవ్‌లు ఇందులో పాల్గొన్నారు. ర్యాలీ పైడితల్లమ్మ కోవెల, కోట మీదుగా ఆనందగజపతిరాజు ఆడిటోరియం వరకు సాగింది. దోమల నివారణ పద్ధతులపై నినదిస్తూ ర్యాలీ చేశారు. అనంతరం ఆనందగజపతిరాజు ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత, సమాజ శ్రేయస్సులో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. దోమలు, క్రిమి కీటకాలు వృద్ధి చెందకుండా చూడాలన్నారు. ఎమ్మెల్యే మీసాల గీత మాట్లాడుతూ దోమల నివారణకు కెమికల్స్ కలిపిన దోమ తెరలను పంపిణీ చేస్తున్నామన్నారు. జడ్పీ అధ్యక్షురాలు శోభా స్వాతిరాణి మాట్లాడుతూ ఆరోగ్యకర సమాజ స్థాపనకు ప్రతిఒక్కరు తోడ్పాటు అందించాలన్నారు. కలెక్టరు వివేక్ యాదవ్ మాట్లాడుతూ ప్రజల భాగస్వామ్యం, చైతన్యంతోనే సమాజంలోని రుగ్మతలను పారదోలగలమన్నారు. జేసీ లత్కర్, ఏజేసీ నాగేశ్వరరావు, డీఎంహెచ్‌వో పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.




సదస్సులో మాట్లాడుతున్న మంత్రి మృణాళిని, చిత్రంలో జడ్పీ అధ్యక్షురాలు స్వాతిరాణి, ఎమ్మెల్యే గీత, కలెక్టరు వివేక్ తదితరులు